కథ 2001

17



# నేలతిమ్మిరి

కాట్రగడ్డ దయానంద్

రాత్రి మూడో జాము-

గాలి వీచటం మర్చిపోయినట్లుగా వుంది. వెన్నెల మంచుతో కలిసి భూమండలాన్ని చల్లటి ముద్దను చేస్తోంది.

హైవే మీద తెంపు లేకుండా సాగిపోతున్న వాహనాల రొద- రైలు బండి ఒకటి ఆగకుండా ఆఘ మేఘాల మీద వెళ్లిపోతూ మూసీనది మీద సృష్టించిన విచిత్ర అలజడి.

ఇవేవీ లక్ష్మయ్యకు నిద్రాభంగం కలిగించటం లేదు. మరేదో... ఇంకేదో... అర్థమైనట్లు కానట్లు మరిం కేదో... గుండెల్లో సన్నని మంట... అలజడి... ఆవేదన... ఆక్రోశం... అసలు నిద్రపడితే కదా నిద్రాభంగం కావ టానికి!

ఎవరితోనో ఏదో చెప్పుకోవాలన్న తపన- మంచ మ్మీంచి లేచాడు. తల వాకిట ఉన్న మంచినీళ్ల చెంబును ఖాళీ చేశాడు.

రహస్యంగా కురిసిన మంచు వర్షానికి పక్కగుడ్డ లన్నీ తడిసి ముద్దయినాయి. పక్కన పడుకున్న పదేళ్ల చిన్నకొడుకు ఆ చల్లదనానికి కాబోలు మోకాళ్లు మునగ తీసుకుని గుప్పిటలా ఒదుక్కుని పడుకున్నాడు. లక్ష్మయ్య మంచాన్ని ఇంటిముందు వాకిట్లోకి పట్టు కుందామనుకున్నాడు.

సాయంపట్టే మనిషి కావాలి. మనసులోని దుఃఖాన్ని దోసిలి పట్టి ఆర్తితో పంచుకునే మనిషి కావాలి. పందిట్లో ఉన్న మంచాల వైపు చూశాడు. భార్య, ఈడొచ్చిన కూతురు, హైస్కూలు కెడుతున్న కొడుకు ఎవరి మంచాల మీద వాళ్లు పడుకున్నారు. వెల్లికిలా పడుకున్న కూతురు మనోరమ తండ్రి మంచం వైపు ఒత్తిగిల్లింది. మంచం వాకిట్లోకి పట్టటానికి భార్య సుజాతను లేపుదామనుకుని అంతలోనే విరమించు కున్నాడు. ఆమె లేస్తే మరి నిద్రపోదు. లక్ష్మయ్యనూ నిద్రపోనివ్వదు.

ఆమె గుండెలో దుఃఖమే కాదు, మరేదీ ఒదగదు. గుండె లోపలి అరల్లో ఒదగని సందేహాల్ని ప్రశ్నల రూపంలో బయటకు తీస్తుంది. ఆమె ఏం మాట్లాడినా ప్రశ్నలతోనే మొదలౌతుంది. అది నడిరేయిగానీ, నడిజాముగానీ... మాటలు ప్రశ్నలై, ప్రశ్నలు చినుకులై, సుడిగాలులై, గాలివానలా మారి ఆఖరుకు ఆమె కన్నీటితో ముగుస్తాయి. సుజాత ఏడుపు లక్ష్మయ్య తట్టుకోలేడు. ఆమె ప్రశ్నల్నీ ఎదుర్కోలేడు. మొదట ఊ కొట్టి ఆ తరువాత సమాధానం చెప్పలేని తన అశక్తతకు ఆమెను ఛీ కొడతాడు. బూతులతో గొంతు పెద్దది చేసి చివరకు చేతులకూ పని చెబుతాడు. ఆమె ప్రశ్నలకు ఈ విధంగా జవాబులు దొరుకుతాయి.

సరిగ్గా నిన్న రాత్రి ఇదే జరిగింది.

పొలాన్నుంచి మోసుకొచ్చిన అలవిగాని పచ్చిగడ్డి మూటను ఉసూరని నిట్టూరుస్తూ, తల మీంచి ఎత్తి కిందేసి మంచానికి అడ్డం పడింది సుజాత. పొలమేమో దూరాభారం... మైళ్లకు మైళ్లు నడవాలి. పైపెచ్చు ఈ మధ్య ఏ కాస్త దూరం నడిచినా పిలిస్తే పలికే మోకాలి నొప్పులు.

వెనకే బఱ్ఱెగొడ్లను తోలుకొచ్చిన లక్ష్మయ్య తల గుడ్డ తీసి విదిలించి మంచమ్మీద కూర్చుని మంచి నీళ్లు తెమ్మని కేకేసేడు. సుజాత వినీవిననట్లు అట్లాగే

పడుకుంది. కాళ్లను నులక మంచం పట్టెకు తాటించి, దువ్వ నిండి సలపరం పెడుతున్న కాళ్లనూ మోకాలి చిప్పల్నీ చేత్తో ఒత్తుకుంటోంది. చెరువు నుంచి మంచి నీళ్ల బిందెతో వచ్చిన మనోరమ బిందె దించి ఇద్దరికీ మంచినీళ్లు తెచ్చిచ్చింది.

''ఏం! వచ్చీరాగానే సతికిల పడకపోతే ఒకమాలే గొడ్లను కట్టెయ్యొచ్చుగా! వామ్మీద పడకుండా!'' అంది సుజాత.

లక్ష్మయ్య, ''నాకు చెప్పకపోతే నువ్వేం చేస్తున్నా,'' తీక్షణంగా చూస్తూ అన్నాడు.

''చేసేందుకేముంది! నాకేమన్నా పనా, పాడా! ముప్పొద్దులా తింటూ కదల్లేకుండా వుంటిని గదా,'' అందామె మోకాలి చిప్పల్ను చేతుల్తో మర్దన చేసుకుం టూనే. కోపంగా చూసి అప్పటికి ఊరుకున్నాడు లక్ష్మయ్య.

మనోరమ గొడ్లను కట్టుగొయ్యలకు కట్టేసి బయటి పొయ్యిల్లో నిప్పు రాజేసి, ఒక పొయ్యి మీద నీళ్లు, మరొక పొయ్యిమీద బియ్యానికి ఎసరూ పెట్టింది. పొయ్యి నిండా పొగకట్టెలను పెట్టి చిటపటా వస్తున్న మంట పొగలోనికి సుదీర్ఘంగా చూడసాగింది.

''ఏమ్మా రమా! ఏందే అట్లున్నావు! ఉషారు లేదా,'' పొయ్యి వైపు చూస్తూ అడిగింది సుజాత.

''అబ్బే! బాగానే ఉందమ్మా,'' అంటూ ఏదో పని ఉన్నట్లు ఇంట్లోకి వెళ్లింది మనోరమ.

అప్పటికే చిరుచీకట్లు ముసురుకుంటున్నాయి. ఇంటి ముందు వేపచెట్టు మీద పక్షుల కలకలం...

''అయ్యోవ్! మోకాళ్లు పీకుతున్నాయి. కాస్త పాలు పిండి కేంద్రానికి పోసి రారాదూ, వేళ తప్పుద్ది,'' బతి మాలుతున్నట్లుగా అంది సుజాత.

లక్ష్మయ్య వినీ వినట్లే ఊరుకున్నాడు. మాట్లాడ లేదు, మంచమ్మీంచి కదల్లేదు. తనకి తప్పదన్నట్లుగా సుజాత మంచమ్మీంచి లేచి ముక్కాలి పీట వేసుకుని పాలు పిండి కేంద్రానికి పోసొచ్చింది. మోకాళ్ల నొప్పుల్తో బొత్తిగా కింద కూర్చోలేకపోతోంది. గాలికి అటూ యిటూ ఊగుతూ భగభగ మండుతున్న పొయ్యి ముందు కూడా ముక్కాలి పీట వేసుకునే కూర్చుందామె.

లక్ష్మయ్య కూతుర్నడిగి ఇంట్లో నుండి వేయిం చిన కందిబేడల్ని తెప్పించుకుని గుప్పిటలో ఉంచుకొని కొద్దికొద్దిగా నములుతున్నాడు. పొయ్యి మీద కాగిన నీళ్లు, వుడుకుతున్న అన్నం తుకతుకమంటున్నాయి. ''ఏయ్యా! వడ్ల సంగతి కనుక్కున్నావా? రైసుమిల్లాయన ఏమన్నాడు?'' పొయ్యిమంట వెలుతుర్లో ముఖం ధగ ధగలాడుతుండగా అడిగింది సుజాత. లక్ష్మయ్య వినీ విననట్లు పంటితో కందిబేడల్ని పటపట లాడిస్తున్నాడు. సుజాత మనసు పొయ్యి మీద మసలుతున్న నీళ్లలాగానే ఉంది. పెళ్లై పాతికేళ్లు- తనంటే నిర్లక్ష్యం, తన మాటంటే విలువలేనితనం. పని దగ్గరకొచ్చేసరికి ఒళ్లు దాచు కోలేదు తను. తనకున్న ఒక్కగానొక్క తమ్ముడు బ్రతుకు తెరువు వెదుక్కుంటూ వెళ్లి ఎక్కడో హైదరాబాదు అవతల స్థిరపడ్డాడు. పుట్టింటి వైపు పలుకరించే దిక్కు కూడా లేదు. నాలుగురోజులనాడు తన కొడుకు పెళ్లంటూ కార్డులు పట్టుకుని అక్కను వెదుక్కుంటూ వచ్చేడు తమ్ముడు. అక్కనీ పిల్లల్నీ పదిరోజుల ముందే తనతో తీసుకొని వెళతానన్నాడు. సుజాతకు ఒకపక్క తమ్ముడిని చూసిన సంబరం, మరోపక్క సలిపిరింత. మెడలో పసుపుతాడు, ఒంటి మీద కట్టుడు చీరలు తప్ప మరో అలంకారం లేదు. సరడూ, నల్లపూసలు, గాజులజత అన్నీ మూడేళ్ల నుంచి బ్యాంకులోనే మూలుగుతున్నాయి. పద్దెనిమిదేళ్లనాడు పొలం పెట్టు బడులకని బావమరిది దగ్గర చేబదులు తెచ్చాడు లక్ష్మయ్య. వాటిని ఇంతవరకూ సర్దలేకపోయారు. వాటిని ఈ పెళ్లినాటికైనా సర్దాలి. మొత్తం మీద ఒక ఇరవై వేలైనా అయితే సుజాత ఈ పెళ్లికి వెళ్లచ్చు.

''ఏయ్యా! నా మాటలు వినబడలేదా! వడ్ల సంగతి ఏం చేశా?'' అని మళ్లీ రెట్టించింది సుజాత.

''వినబడింది లేవే! వారంరోజుల నుండి రోజూ నసైపోయింది నీది,'' విసుక్కున్నాడు లక్ష్మయ్య.

''నిజమే! నాది నసే. నేనంటే నీకసలు లెక్కే లేదు. నన్ను పెళ్లికి పంపే వుద్దేశం ఉందా లేదా? నాకున్నదే వాడొక్కడు. ఆ కాస్త దారప్పోగును తెంపెయ్యబాకు,'' అంటూ ఏడ్పుగొంతుతో అంది సుజాత. ఇంతలో పక్కింటి ఆమె చెంబుతో వస్తే తనూ చెంబు పట్టుకు వెళ్లింది సుజాత. మనోరమ ఇంట్లో నుండి బయటకు వచ్చి తల్లి వెడుతున్న వైపు దృష్టి సారించింది.

నాలుగు నెలల్నాడు పండిన ఒడ్లు...

ఎప్పుడూ కళ్లంలోనే బేరగాళ్లు ముసురుకునే వాళ్లు. అటువంటిది ఈసారి కొనేవారు కరవయ్యేసరికి పండిన ఒడ్లు పురులు కట్టారు, పాతర్లు వేసేరు. అవి వాటిలోనే ముక్కి, మాగి పడున్నాయి. రైతులు మిల్లుల చుట్టూ తిరిగినా, మార్కెట్టు యార్డుల చుట్టూ తిరిగినా కొంటామన్న నాధుడే లేడు. ఒడ్లు కావాలని తలెత్తి

చూసేవాళ్లే లేరు. ఏమైందని అడిగితే, "ఉత్తరాది నుండి కుప్పలు కుప్పలుగా చవగ్గా వచ్చి పడుతుంటే మన ఒడ్లను మూచ్చూసే వాడెవడు," అన్నాడు లక్ష్మయ్యతో, తెల్సిన వ్యాపారస్తుడు. అప్పటికీ ఏదో ఒక రేటుకు తెగ నమ్మి పారేద్దామని, ఈ పెళ్లి గండం నుండి గట్టెక్కుదామని చూసేడు. ఇవాళ రేపని సముదాయిస్తున్నాడు. "నాన్నా నీళ్లు తోడుతా లెగు," మనోరమ తండ్రిని కేకేసింది. లక్ష్మయ్య పైకి లేచి పందిరి గుంజకు చుట్టిన గోచీగుడ్డను మొలకు చుట్టుకుని స్నానానికి వెళ్లేడు. స్నానం పూర్తయి పంచె కట్టుకునేలోపే ఉరుములు మెరుపులతో ధుమధుమలాడుతూ వచ్చింది సుజాత.

"అయ్యోవ్! ఈ సంగతి నీదాకా వచ్చిందా లేదా! వచ్చినా నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకున్నావా? నీ మేనల్లుడు రేప్పొద్దున ఎగురుకుంటూ అమెరికాకు పోతున్నాడంటగా! పెద్ద మునసబు కొడుకు డబ్బులు సర్దేడంట. మునసబు మనవరాల్ని చేసుకునే ఒప్పంద మ్మీద. ఊళ్లోనే ఉంటిమి. ఈ మంతనాలు మనకు తెలువకపాయ్యె."

"ఎవరు చెప్పేరే నీకా సంగతి?" మెల్లగా అడిగాడు లక్ష్మయ్య. మనోరమ కళ్లు మాత్రం మంట వైపున్నా చెవులు మాత్రం మాటల వైపు తిప్పింది.

"ఊరంతా కోడై కూస్తుంటే ఒకళ్లు చెప్పేదేవిటయ్యా? వాడు పుట్టిననాటి నుండి నువ్వు పెట్టిన పెట్టుబడంతా ఏమైనట్లు? అక్షరాభ్యాసం కాడి నుండి నిన్నటిదాకా మన సొమ్ముతోనేకదా చదివాడు. ఇయ్యాల్టి కియ్యాల అమెరికా పోవడానికి డబ్బులు సర్దలేకపోయామని మన బిడ్డ ఎగటైందా? పో! పోయి తేల్చుకో. నా బిడ్డని చేసుకుంటాడో లేదో," పెద్దగా అరిచింది సుజాత.

"అయిందానికి కానిదానికి ఊరికే నోరు పారేసుకోబాకు. అరచి రాద్ధాంతం చేయకుండా కాస్త నోరు మూసుకో. కాస్తుంటే ఇంకాస్త చెప్పుకుంటారు ఊళ్లో జనం. అరిస్తే నలుగురిలో నవ్వులపాలయ్యేది మనమే. ఆడపిల్లగల్లోలం. రాత్రికి నే వెళ్లి కనుక్కుంటాలే," లక్ష్మయ్య బాడీ వేసుకుని బయటకు బయలుదేరాడు.

"ఎల్లకాలం నా నోరు మూద్దువు కానీలే. వద్దయ్యా అంటే మేనల్లుడు మేనల్లుడని ఉన్నదంతా ఊడ్చి వాడి ఎదాన పోసేవు. ఇయ్యాల నన్ను, నా పిల్లలను అన్యాయం చేశావు!" రోషంగా మాట్లాడింది సుజాత.

"నీయమ్మ! నోటి తీట లంజా! నోరు మూస్తావా? పళ్లు రాలగొట్టమంటావా?" అంటూ మంచం పక్కనే ఉన్న గడ్డిమోపు తాడందుకుని సుజాత వీపు మీద ఛెళ్ ఛెళ్మని రెండు దెబ్బలు వేశాడు లక్ష్మయ్య. సుజాత కుమిలిపోతూ ఏడుస్తూనే ఇంట్లోకి నడిచింది. లక్ష్మయ్య బజార్లోకి నడిచాడు.

వర్తమానంలోకి వచ్చాడు లక్ష్మయ్య. మంచం పట్టటానికి భార్యను లేపుదామన్న ఆలోచనను విరమించుకున్నాడు.

గుడ్లగూబ ఒకటి కరెంటు వైరు మీద కూర్చుని మెడను రెట్టించి అటు ఇటు తిప్పి మిడిగుడ్లేసుకు చూస్తుంది. అంత రాత్రిలోనూ ఏదో పని ఉన్నట్లు కారు నల్లటి జెముడు కాకొకటి పెద్దపెద్దగా అరుస్తూ చెట్టు చుట్టూ గిరికీలు కొడుతోంది. ఎక్కడివో కట్టుగొయ్యలు తెంచుకున్న బక్కెగొడ్లు రెండు భయంభయంగా బిత్తర చూపులు చూస్తూ పెద్దపెద్దగా అరుస్తూ చేలెంబడి పరుగులు తీస్తున్నాయి.

మంచమ్మీద కూర్చునే దక్షిణం వైపున్న పుగాకు బ్యార్నీ వైపు చూసేడు లక్ష్మయ్య. నిరుడు ఈరోజుల్లో బ్యార్నీ పొయ్యి భగభగ మండుతూ ఉంది. పగలంతా పొలంలో ఆకుకొట్టే పనులతోనూ రాత్రులు బార్నీ దగ్గర పచ్చాకు గిల్లే పనులతో, ముఠాకూలీల అరుపుల్తో, కేకలతో సందడిగా ఉండేది. అయిదారు నెలలు అడ్డమైన చాకిరీ చేసి వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండిన పుగాకును బోర్డు కాడికి తీసుకెళ్లి లైన్లో పెడితే ఎట్టుందో చూడటానికి కూడా ఒక్క వ్యాపారస్తుడూ ముందుకు రాకపాయె. మూడేళ్లనాడు కొన్న పుగాకే బోర్డు దాటి బయటకు పోలేదని, చేతిలో పెట్టుబడులకు డబ్బులాడటంలేదనీ చిన్న వ్యాపారస్తులు ఎవ్వరూ ఆ దరిదాపుల్లోకి రాకపోతిరి. రెక్కలు ముక్కలు చేసుకొని తల తాకట్టు పెట్టి పండిస్తే కొనేవాడు దిక్కు లేకపాయె!

ఈలోగా ఎండకూ, గాలికీ పుగాకు పళపళలాడటం, రంగు మారటం, గ్రేడు తగ్గటం, ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ కాదనటం- ఎందుకిట్లా జరిగిందని రైతులు మీటింగు పెట్టి ఇదంతా పెద్ద కంపెనీలు, విదేశీ కంపెనీలు పుగాకును చౌకగా కొనటానికి చేస్తున్న మాయని తేలిస్తిరి. మూడేళ్లు చిన్నాచితకా వ్యాపారులకు పుగాకు ఆర్డర్లు లేకుండా చేసి, ఎక్స్‌పోర్ట్ కానీకుండా ఆపి వాళ్లు ఆక్షన్ ప్లాటుఫారాల వైపు రాకుండా పోటీ లేకుండా చేసుకుంటిరి పెద్ద కంపెనీల వాళ్లు. ఇక లాభం లేదని రైతులు రైళ్లాపి ధర్నాలు చేస్తిరి.

బస్సుల్ని, లారీల్ని నడిరోడ్డు మీద నిలేస్తే గవర్నమెంటు దిగొచ్చి ఎస్టీసీని పంపి కొనిస్తారనే! ఈలోగా పెద్ద కంపెనీలు అన్నీ ఒకటై సిండికేటుగా మారి వేలం పాటల్లో పోటీ పడకుండా, 'నువ్వు నాలుగుబేళ్లు కొనుక్కో, నేను నాలుగుబేళ్లు కొంటా,' అని అయిన కాడికి, వచ్చిన కాడికి రైతుల్ని ముంచితిరి. తీరా చూస్తే పెట్టిన పెట్టుబడులు సరే, పండింది అమ్ముకోడానికే దేవుడు కనబడె!

ఇట్టా కాదని ఒక సంవత్సరం పుగాకు పండించకుండా క్రాపు హాలిడే వేసుకుందామని రోడ్డు మీద రైతుల మీటింగు. పుగాకు పంట వెయ్యాలని కొందరు, వద్దని కొందరు- బోర్డు దగ్గర రైతుల అభిప్రాయం ప్రకటించాలని కోర్టు ఆదేశం. పెద్ద మునసబు కంపెనీ గుమాస్తా రైతుల మీటింగు దగ్గరకు వచ్చి, ఈ సంవత్సరం పుగాకు వేసుకునేవాళ్లకు వాళ్ల కంపెనీ తరఫున పురుగుమందులను ఫ్రీగా ఇస్తారని చెప్పేడు. జనంలో కలకలం. దీనివలన మీ కంపెనీకేమి ఒరుగుతుందని నిలదీసేరు జనం.

''ఒరేయ్! ఇందులోనే ఉందిరా కిటుకంతా. ఎట్టయినా మనచేత పుగాకు వేయించాలని కంపెనీలోల్ల పన్నాగం. మొన్నటికి మొన్న సిగరెట్టు కంపెనీలోల్లు మినిస్టర్ని పట్టుకొని వాళ్ల వైపు త్రిప్పుకొని క్రాపు హాలిడే కాకుండా చెయ్యాలని చూసేరు. రైతులందరూ ఒకే మాట మీదుండేసరికి అది వీలుకాక ఇప్పుడు రైతులు వెళ్లినట్లుగానే కోర్టు కెళ్లేరు. మనమిప్పుడు పంటలేస్తేనే కదా ఏదో ఒక రేటుకి మనల్ని ముంచి వాళ్లు వ్యాపారాలు చేసుకునేది. ఈ ఒక్క సంవత్సరం ఆగితే కింద టేడు నిల్వలన్నీ అయిపోతాయి. వచ్చే సంవత్సరం ఎట్టయినా రేటు పెట్టి కొనాల్సిందే. అదీగాక రైతులందరూ ఒకటైతే వాళ్ల ఆటలు సాగవుగా. మనల్ని ఏమార్చి, ప్రలోభపెట్టి చీల్చాలని చూస్తున్నారు. మనల్ని ఎట్టయినా పుగాకు వేయించాలని పై దేశాల్నించి దొరలొచ్చి కూర్చున్నారు. వాడి మాటలు నమ్మబాకండిరో,'' అంటూ అరిచేడు.

జనంలో కలకలం మొదలైంది. ఒకరిద్దరు మునసబు గుమాస్తాను చెయ్యి కూడా చేసుకున్నారు. ఆఖరకు క్రాపు హాలిడే చెయ్యాలని నిర్ణయించేరు రైతులు. ''ఏం రోజులొచ్చినాయిరా మన బతుకులకు. మనచుట్టూ ఏం జరుగుతుందో తెలియని రోజులైనై. పడమట దేశాన వేరుశనగ పంట వేసేరన్న! ఇయ్యేడు కాయ ఏం దిగిందని! అమ్ముకునే కాడ కొచ్చేసరికి... సవక సవకని ఏ యింట్లో చూసినా పామాయిలే వాడుతుంటిరి. మలేషియా నుండి వచ్చిన పామాయిలు బొంబాయి హార్బర్లో మూలుగుతుందంట. ఇంక మన శనక్కాయలు కొని ఏం చేసుకోవాలని అంటున్నారు వ్యాపారులు. ఏ పంట వెయ్యాలో తెలీదు. ఏదో ఒకటి ధైర్యం చేసి వేస్తే అది కొంటారో లేదో తెలీదు. ఇంతకు ముందంతా పంట పండేదే గగనం. ఇప్పుడు అమ్ముకోవటం కూడా కనాకష్టమైంది. అసలు సేద్యమే మానేసి ఏ రోడ్డు పనికో కూలీలుగా పోయింది నయమన్నా. ఇంట్లో నలుగురముంటే నాలుగొందలు వస్తాయి,'' మీటింగుకు పక్క ఊర్నించి వచ్చిన రైతు కూడా ఇదే అన్నాడు.

అన్నీ గుర్తొచ్చి మనసు వికలమైంది లక్ష్మయ్యకు. మంచమ్మీంచి లేచి ఒళ్లు విరుచుకున్నాడు. చెప్పు లేసుకొని బొటనవేళ్లు సర్దుకుని బ్యార్నీ వెనక్కి వెళ్లాడు. ఆయన అటు వెళ్లగానే కూతురు మనోరమ మంచమ్మీంచి లేచి కూర్చుంది. చెదిరిన జుట్టును, పైటను సర్దుకుని తండ్రి వెళ్లిన వైపు గబగబా నాలుగడుగులు వేసింది. లక్ష్మయ్య ముంగాళ్ల మీద కూర్చుని ఒంటేలు పోసుకుని పైకి లేస్తున్నాడు. బొయ్యిమంటూ ఆకాశంలో వినబడీ వినబడనట్లు శబ్దం... మిణుకు మిణుకుమంటూ ఎర్రలైట్లు వెలుగుతున్న విమానమొకటి ఆకాశంలో వెడుతోంది. ఎర్రలైటు వెడుతున్నంతసేపూ అలానే చూస్తూ నిలబడ్డాడు లక్ష్మయ్య. మనోరమ మనసు కుదుటపడింది. చేలో పురుగు మందు చల్లే పని అయిపోగానే ఖాళీడబ్బాల్ని మిగిలిపోయిన మందు డబ్బాల్ని బ్యార్నీ వెనుక గుర్తుగా పూడ్చి పెడతాడు. లక్ష్మయ్య ఆ ప్రదేశానికి దూరంగా ఉండటంతో కుదుటపడి గబగబా వచ్చి తన మంచం మీదకి చేరింది మనోరమ. ఇంతవరకూ ఒకవైపు తిరిగి పడుకున్న సుజాత ఇప్పుడు రెండోవైపు తిరిగి పడుకుంది.

లక్ష్మయ్య వచ్చి మంచమ్మీద కూర్చున్నాడు. పక్కగుడ్డలు మళ్లీ దగ్గరకు చుట్టి మరొక్కసారి మంచాల వైపు చూసేడు. మనోరమ గప్‌చుప్‌గా కళ్లు మూసుకుంది. పొద్దున పొలానికెడుతూ సుజాత అన్న మాటలు గుర్తుకు వచ్చాయి ఆమెకు.

''మేనల్లుడు మేనల్లుడని నీకు ఇంజనీరు మొగుడ్ని కట్టబెట్టాలని ఎగురుకుంటూ, ఈ ఇల్లూ నా ఒళ్లూ గుల్ల చేశాడు మీ నాయన. ఆ చదువుకు పెట్టిన డబ్బులున్నట్లయితే ఇయ్యాల నీ పెళ్లి సలక్షణంగా జరిగిపోవును. ఇన్నాళ్లూ అనుకున్న సంబంధం, అయిన

సంబంధం ఎనక్కెడితే నలుగురూ ఏమనుకుంటారో? పిల్లలోనే ఏదో లోపముందని అనుమానపడుతారు గామాల. డబ్బుకు డబ్బూ పోయే, పరువుకు పరువూ పోయె. నలుగురిలో పలుచనయితిమి. అట్టాని నువ్వే మైనా అగాయిత్యం చేసుకుంటావేమో తల్లీ. ఆగం చెయ్యబాక! జరిగిందేదో జరిగింది. జరగాల్సిందానికి ఆ బగమంతుడున్నాడు. కాస్త మీ నాయన్ని కూడా కని పెట్టుండు. రాత్రి నుంచి మన లోకంలో లేడు."

కళ్లు తెరిచి తల్లి మంచం వైపు చూసింది మనో రమ. బుగ్గ మీద వాలిన దోమను కళ్లు మూసుకొని శబ్దం వచ్చేట్లు చేత్తో కొట్టింది సుజాత. మళ్లీ చూపును తండ్రి మంచం వైపు కదిలించింది. కూర్చునే ఆకాశం వైపు చూస్తున్నాడు లక్ష్మయ్య. ఆకాశంలో ఎగిరిపోయిన విమానం కోసం దేవులాడుతున్నట్లుంది ఆమెకు. మళ్లీ కళ్లు మూసుకుంది మనోరమ.

గోడమీద కోడిపుంజు రెక్కలు టపటపా కొట్టు కుని కూత వేసింది. కరెంటు తీగ మీద గుడ్లగూబ ఒక సారి ఆకాశంలో గిరికీలు కొట్టి మళ్లీ అదే స్థానంలో కూర్చుంది. జెముడుకాకి అవిశ్రాంతంగా అరుస్తూ ఇంటి ముందున్న చెట్టు చుట్టూ గిరికీలు కొడుతుంది. కళ్లు మూసుకున్న మనోరమ కళ్ల ముందు అనేక దృశ్యాలు...

పెద్దమనిషి అయినప్పుడు మేనత్త వచ్చి వాటేసు కుని, 'నా బంగారుతల్లి,' అంటూ తన చుట్టూ చేతులు తిప్పి కణతల మీదుంచి మెటికలు విరిచిన శబ్దం... సెలవలకొచ్చిన సురేషు పంచలో మంచం మీద కూర్చుని తండ్రితో మాట్లాడుతూ ఇంట్లోకి తొంగి చూసి తనకు మాత్రమే తెలిసేట్లు పెదవుల మీద మెరిపించిన చిరునవ్వు... అట్లతద్ది పండుగ నాడు సాయంసంధ్యలో తను ఎక్కడ పడుతుందో అని సుతారంగా ఉయ్యాల ఊపిన సురేషు... "నీకేమి ఇంజనీరు మొగుడంటగా," అని తనవైపు ఈర్ష్యగా చూసిన తోటి ఆడపిల్లలు...

'తాను సురేషుని ప్రేమిస్తుందా?' తనను తానే ప్రశ్నించుకుంది మనోరమ.

'లేదు లేదు అంతకన్నా ఎక్కువే. ప్రేమకు హద్దుంది. అనుబంధానికి హద్దు లేదు. తను పుట్టగానే సురేషుకు పెళ్లాం పుట్టిందని పడ్డ పేరు... అలా అలా ఎదిగి ఈ పద్దెనిమిదేళ్లలో దృఢమైంది ఆ ముద్ర...' ఆలోచిస్తోంది మనోరమ.

తండ్రి చితికిన మేనత్త సంసారానికి ఆసరా అయి నాడు. అప్పోసొప్పో చేసి సురేషును బాపట్లలో ఇంజనీ రింగు చదివించేడు. రేపు మాఘమాసంలో తిరుపతి వెళ్లి ఆ మూడుముళ్లూ వేయిద్దామనుకున్నాడు. ఈలోగా సురేషు అమెరికా వెళ్లాలన్నాడు. ఖర్చులకు లక్ష రూపా యలు కావాలంటూ ఇంటి చుట్టూ తిరిగింది మేనత్త. ఊళ్లో ఎవరినడుగుదామన్నా వెయ్యి రెండు వేలు కాదాయె. ఎక్కడి ధాన్యం అక్కడే ఉండి పచ్చనోట్లు చూడటమే కష్టంగా ఉంది. ఉన్న కాస్త పొలమూ పోకూరు కోమట్ల దగ్గర తాకట్టు పెట్టి మూడు రూపా యలు వడ్డీకి తెచ్చేడు. అది ఇప్పటికే తడిసి వడ్డీతో మోపెడైంది. లక్ష రూపాయలు సర్దటం తన వల్లకాదని చెప్పగానే కళ్లనీళ్లు పెట్టుకుంది మేనత్త.

ఏం మాట్లాడుకున్నారో ఏమో... రాత్రికి రాత్రి పెద్ద మునసబు కొడుకు లక్షరూపాయలు సర్దాడని, అమెరికా వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేసేడని తెలిసింది. ఆరోజు పొద్దునే అమెరికా వెళ్లిపోయాడనే కబురుతో పద్దెని మిదేళ్ల మానసిక అనుబంధం లక్ష రూపాయలతో తెగిపో యింది.

'అన్నాళ్లూ వాడి చదువుకు పెట్టిన ఖర్చు అణా పైసలతో సహా వడ్డీ కట్టి అబ్బాయి అమెరికా నుండి పంపగానే తీరుస్తామని,' సురేషు తండ్రి అన్నట్లు ఊరంతా పుకారు. అన్నీ గుర్తొచ్చి మనోరమ మధనపడ సాగింది. ఇలా ఎందుకు చేసేడు సురేష్? బాగా చదువు కున్న వాడు అన్నీ తెలిసినవాడు... తనంటే ఎంతో ఇష్ట మనుకునేది. చిన్నప్పటి నుండీ తనకు లెక్కలు రావనీ, లెక్కలు రాకపోతే చదువులో చాలా కష్టమని, తనని కష్టపడి లెక్కలు నేర్చుకోమని చెప్పేవాడు. తన నుంచి సురేషుని దూరం చేసిన లెక్కల గురించి ఆలోచించ సాగింది మనోరమ. మెల్లిగా కళ్లు మూతలుపడసాగాయి.

లక్ష్మయ్య మంచమ్మీద కూర్చుని ఆకాశం వైపు చూస్తున్నాడు. ఆయనకు భవిష్యత్తంతా చీకటిగా కన బడుతుంది. తన చుట్టూ జరుగుతున్న విషయాలేవీ అంతు చిక్కటం లేదు. మేనల్లుడు తన కూతుర్ని కాదని వేరే సంబంధం స్థిరపరచుకుని ఎగిరిపోయేడు. ఎటు చూచినా అప్పులు... వెనక ఎదిగొస్తున్న పిల్లలూ... ఆయన మదినిండా ఎడతెగని ఆలోచనలు... 'కూతురి పెళ్లి చేయగలనా... మగపిల్లలకి ఏదో ఒక దారి చూపగలనా...' సుజాత అన్నట్లు తెలిసో తెలియకో తన పిల్లలకు అన్యాయమే జరిగింది. వ్యవసాయం చేసి లాభం లేదు. పెట్టుబడులు, ఊర్నిండా అప్పులు తప్ప పైసా వెనక్కి చూడటంలేదు. ఈ పరిస్థితులన్నిటినీ భవిష్యత్తులో జయించగలనా? గుండె నిండా దుఃఖం... సమాధానం లేని ప్రశ్నలు... మళ్లీ మంచమ్మీంచి లేచేడు. ధాన్యం పురి చుట్టూ ఒక చుట్టు తిరిగాడు.

పుగాకు బ్యార్నీ పొయ్యిని ఒక చేత్తో తడిమాడు. మళ్లీ బ్యార్నీ చాటుకు వెళ్లాడు. మనోరమకు మాగన్నుగా నిద్ర పట్టింది. సుజాత కళ్లు తెరిచి మనోరమ మంచం వైపు, లక్ష్మయ్య మంచంవైపు చూసి ఉలిక్కిపడింది. లక్ష్మయ్య కోసం బ్యార్నీ వెనక్కి పరిగెత్తింది. అప్పటికే లక్ష్మయ్య పురుగుమందులు పూడ్చి పెట్టిన దగ్గర కర్రపుల్లతో గుంటను తవ్వేడు. ముంగాళ్ల మీద కూర్చుని మందు డబ్బాలు బయటకు తీసేడు.

ఒక్కో డబ్బాను రెండు చేతుల్తో ఊపి చూస్తూ ఖాళీడబ్బాల్ని పక్కన పడేస్తున్నాడు. పురుగుమందు డబ్బా మూత తీసేడు. సుజాత వెళ్లి గభాల్న లక్ష్మయ్య చెయ్యి పట్టుకుంది. "నువ్వొక్కడివే తాగితే ఎట్టయ్యా! నా గొంతులోనూ, నా బిడ్డల గొంతులోనూ కాస్త పొయ్యి. సస్తే అందరం కలిసే సద్దాం. మళ్లీ బతికినోళ్ల ఉసురు నీకెందుకు," అంటూ లక్ష్మయ్య చేతిలోని మందు డబ్బాను విసురుగా లాక్కొని దూరంగా పారబోసింది. లక్ష్మయ్య లేచి నిల్చుని నిలువెల్లా దుఃఖంతో వణుకు తున్నాడు. కాళ్లు కంపిస్తుంటే నడక తడబడుతోంది. ఏదేదో గొణుక్కుంటూ చిన్నపిల్లాడిలా మెల్లిగా ఏడవటం మొదలుపెట్టాడు. పొంగి పొరలే దుఃఖం... మెల్లిమెల్లిగా కన్నీరై ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

"ఏడవబాకయ్యా! గమ్మునుండు. అపరేత్రి... ఎవురైనా చూస్తే బాగుండదు. ఇంట్లో పెళ్లీడుకొచ్చిన పిల్లుంది. నలుగురిలో వెలితిపడతాము. అయినా నీ భ్రమకానీ, ఇంత బతుకూ బతికి ఒక్కగానొక్క పిల్ల పెళ్లి చేయలేకపోతామా? మనకూ రెక్కలున్నయి గదయ్యా. ఈ మాయదారి సేద్యం కాకపోతే కూలి చేసైనా బతి కిచ్చుకోమా బిడ్డల్ని! సరే పద! ఇట్టాంటి ఆలోచన ఇంకెప్పుడూ చేయబాక," అంటూ లక్ష్మయ్య చేతి రెక్క పట్టుకుని లాక్కువచ్చి మంచమ్మీద కూర్చోబెట్టింది. మనోరమ జరిగింది చూసి నిశ్చేష్టురాలై మంచమ్మీద కూర్చునుంది. మగపిల్లలిద్దరూ మంచినిద్రలో ఉన్నారు. సుజాత ఖాళీ అయిన మంచినీళ్ల చెంబు తీసుకొని ఇంట్లోకి వెళ్లి నీళ్లు నింపి లక్ష్మయ్య చేతికి అందించింది. పక్కనే కూర్చుని నీళ్లు తాగిన తరువాత గుండెల మీద అరిచేతుల్తో మృదువుగా రాసింది. కాసేపటికి లక్ష్మయ్య తేరుకున్నాక వాములోంచి గొడ్లకు గడ్డి దూసి వేసొచ్చి మంచం కాళ్లకట్ట మీద కూర్చుంది. "అమ్మాయ్! నువ్వు పడుకో," అంది కూతురుతో. గుడ్లగూబ కరెంటు వైరు మీద మిడిగుడ్లేసుకుని చూస్తూనే ఉంది. జెముడుకాకి అరుస్తూ చెట్టు చుట్టూ గిరికీలు కొడుతూనే ఉంది. బత్తెగొడ్లు మేత మెయ్యకుండా నిల్చొని మోరలెత్తి భయంభయంగా చూస్తున్నాయి.

ఇంతలో హఠాత్తుగా ఉరుము ఉరిమినట్లు శబ్దం... ఆకాశం కాకుండా భూమి ఉరిమిన సవ్వడి... ఉత్తరం వైపు నుండి దక్షిణం వైపుకు దడదడమని భూమి కదిలిన జలదరింత... పుడమితల్లి పటపటమని ఒళ్లు విరిచిన శబ్దం... లిప్తకాలంలో మంచాలు, పందిరి, ఇల్లు, గోడలు... సమస్త భూమండలమూ కంపించిన అదురుబాటు. ఇంట్లోని అటకమీద వస్తువులు దడదడ జారిపడిన శబ్దం... ఇంటి ముందు కట్టేసున్న పశువులు కట్టుకొయ్యల్ని తెంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నం... కోళ్లు, పశువులు, జంతువుల అకాలపు అరుపులతో కోలాహలం.

"దీని మొదులార నేలతిమ్మిరి గామాల! గుండె గుభేలుమనిపించింది. యాడ ఏ అట్టడుగు పొరల్లో పుట్టిందో, ఏ పాతాళాన కదలబారిందో, ఈడంతా వణి కించింది. అయ్యోయ్! పిల్లోల్ల మీద చెయ్యెయ్యి, దడుచుకుంటారు," అంటూ సుజాత గభాల్న వెళ్లి పెద్ద కొడుకు మీద చెయ్యి వేసింది. మనోరమ వైపు తిరిగి, "అమ్మాయ్! భయపడమాక. నేలతిమ్మిరిలే! మనల్నేం చెయ్యదు," అంది.

లక్ష్మయ్య కొడుకు మీద చెయ్యివేసి నిమిరి సుజాత వైపు ధైర్యంగా చూసేడు. ఆ రాత్రి నిద్రలో వున్న వాళ్లెవరు భూకంపం వచ్చింది గమనించనే లేదు. మాగన్నుగా మేలుకున్న వాళ్లు ఆ ప్రకంపనల్ని గుర్తించనే లేదు. లక్ష్మయ్య, సుజాత, మనోరమలాంటి వాళ్లు మాత్రం భూకంపాన్ని గుర్తించి అప్రమత్తులయ్యేరు.

*సుజనరంజని- సిలికానాంధ్ర సాంస్కృతిక ఉత్సవ ప్రత్యేక సంచిక, డిసెంబర్ 2001*

